# సత్యవాక్యం

## THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

OCTOBER - 2003

# సంక్షిప్త వార్తలు

2003 సెప్టెంబరు 9, 10 తేదీలలో కాకినాడ సత్యవాణి ఆవరణములో సువార్తికుల సదస్సు మరియు ప్రత్యేక బైబిలు తరగతులు నిర్వహించబడెను. ఆ సందర్భముగా అమెరికా నుండి వచ్చిన సోదరులు డగ్ హేమిల్టన్, జే కోర్బెట్ గార్లు దేవుని వాక్యమునందించిరి. మరియు "ఆత్మవరములు" అను ప్రత్యేక అంశమును ఉపదేశించిరి. అదే సందర్భముగా వారితో వచ్చిన సోదరి లీసా మెక్ గర్వీ గారు స్త్రీలకు ప్రత్యేక తరగతులు నిర్వహించిరి. ఆ రెండు రోజులలోను ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతముల నుండి వచ్చిన సోదర, సోదరీలు గొప్ప ఆత్మీయ సహవాసములో పాలు పొందిరి. ఏడుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సోదరులు టి.వి.యన్. కుమార్ మరియు యస్. జాన్ గార్లు ఆంగ్ల ప్రసంగములను తెలుగున కనువదించుటలో సహాయపడిరి.

పైనుదహరించిన ముగ్గురు విదేశీ సోదరులు, సోదరీ కూడ కాకినాడకు సమీపములో యున్న అనేక స్థానిక సంఘములను దర్శించి వాక్యోప దేశముగావించిరి.

సెప్టెంబరు 7వ తేదీ సాయంత్రం కందరాడలోను, 8వ తేదీ నాడు పులిమేరులోను వాక్య పరిచర్య చేసిరి. కందరాడలో రాజారెడ్డి గారును, పులిమేరులో ఎమ్. కృపానందం గారును వాక్య పరిచర్య చేయుచున్నారు. 10వ తేదీ రాత్రి కొవ్వాడలో వాక్యము ప్రకటింపగా 4గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. అక్కడ గంటా ఫిలిప్పగారు వాక్యపరిచర్య చేయు చున్నారు. సెప్టెంబరు 11వ తేదీ నాడు Z-మేడపాడులో వాక్య పరిచర్య చేయగా ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. Z-మేడపాడులో యం. జేమ్స్‌గారు వాక్యపరిచర్య చేయుచున్నారు. సెప్టెంబరు 12వ తేదీనాడు ఉప్పలగుప్తం, బడుగువారిపేట, వాడపర్రు గ్రామములలో వాక్యపరిచర్య చేయగా 5 గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఎ. వెంకట్రావు, పి. అర్జునరావు, మరియు డి. రంగారావ్ గార్లు పై గ్రామములలో సువార్త చాటుచున్నారు. సెప్టెంబరు 13వ తేదీ నాడు రామచంద్రపురంలో యున్న సంఘమును దర్శించిరి, మరియు 15వ తేదీ ఉదయం సోదరి లీసా గారును, జేకోర్బెట్ గారును అమెరికాకు తిరిగి వెళ్లిరి. 15వ తేదీ నుండి

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

| సంపుటిక 24 | అక్టోబర్ 2003 | సంచిక 3 |
|---|---|---|


# కానుకల నిచ్చుట

(Giving)

క్రైస్తవ్య మంతటిలో దాతృత్వ మెక్కువ విస్తరించి యున్నది. "పుచ్చుకొనుట కంటె ఇచ్చుట ధన్యము" అను సూత్రముపై అది ఆధారపడి యున్నది (అపో.కా. 20:35). పాపులను రక్షించుటకు దేవుడే తన కుమారుని ఈ లోకమున కిచ్చెను. యేసుక్రీస్తును దేవుడు మన కొరకు ఇచ్చుట ద్వారా దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచెను. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్య జీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను3:16). దేవుడు మనుష్యుల యెడల ఉచితముగా తన కృపను కనుపరచెను గనుక మనుష్యులలో కూడ దాతృత్వము విస్తరించ వలెనని యేసు క్రీస్తు బోధించెను. దురాశ కలిగి ఈ లోకములో ఎక్కువ ధనమును సమకూర్చుకొనుట వలన కలుగు లాభము

శూన్యమని ఆయన బోధించెను. ఆయన బోధించిన 38 ఉపమానములలో 16 ఉపమానములను ధనమును గూర్చి, గృహనిర్వా హకత్వమును గూర్చి బోధించెను. "భూమి మీద మీకొరకు ధనమును కూర్చుకొనవద్దు; ఇక్కడ చిమ్మెటయు తుప్పును తినివేయును దొంగలు కన్నము వేసి దొంగిలెదేరు. పరలోక మందు మీ కొరకు ధనమును కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను దానిని తినివేయదు, దొంగలు కన్నము వేసి దొంగిలరు. నీ ధన మెక్కడ నుండునో అక్కడనే నీ హృదయ ముండును....... ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు; అతడు ఒకని ద్వేషించి యొకని ప్రేమించును; లేదా యొకని పక్షముగా నుండి యొకని తృణీకరించును. మీరు దేవునికిని, సిరికిని దానులుగా నుండనేరరు.......... కాబట్టి మీరు ఆయన రాజ్యమును, నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకను గ్రహింపబడును" అని యేసుక్రీస్తు బోధించెను (మత్తయి 6:19-34).

"సంతృప్తి సహితమైన దైవభక్తి గొప్ప లాభసాధనమైయున్నది. మన మీ లోకములోనికి ఏమియు తేలేదు, దీనిలో నుండి ఏమియు తీసికొని పోలేము. కాగా అన్న వస్త్రములు గలవారమై యుండి వాటితో తృప్తి పొందియుందము. ధనవంతులగుటకు ఆపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేక యుక్తములును, హానికరములైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను, నాశనము లోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము; కొందరు దానిని ఆశించి విశ్వాసము నుండి తొలగిపోయి నానాబాధలతో తమ్మునుతామే పొడుచు కొనిరి. దైవజనుడా, నీవైతే వీటిని విసర్జించి నీతిని, భక్తిని, విశ్వాసమును, ప్రేమను, ఓర్పును, సాత్వికమును సంపాదించుకొనుటకు ప్రయాస పడుము" అని అపొ.పౌలు బోధించెను (1తిమో 6:6-11).

పాతనిబంధన కాలములో యూదులు దేవునికి దశమ భాగమును అర్పించవలసినదని ఆయన ఆజ్ఞాపించెను. "భూధాన్యములలో నేమి, వృక్షఫలములలోనేమి భూఫలములన్నిటిలో దశమభాగము యెహోవా సొమ్ము; అది యెహోవాకు ప్రతిష్ఠితమగును" అని లేవీ 27:30 చెప్పుచున్నది. క్రొత్త నిబంధన ఆరాధనలో కానుకలిచ్చుట ఒక భాగమై యున్నది. ప్రతి ఆదివారమున ప్రతి క్రైస్తవుడు దేవునికి కానుకల

నీయ వలెనని క్రొత్త నిబంధన బోధించుచున్నది. అపొ.పౌలు 1 కొరింధి 16:1-2లో ఇట్లు చెప్పుచున్నాడు: "పరిశుద్ధుల కొరకైన చందా విషయమైతే నేను గలతీయ సంఘములకు నియ మించిన ప్రకారము మీరును చేయుడి. నేను వచ్చినప్పుడు చందా పోగుచేయ కుండ ప్రతి ఆది వారమున మీలో ప్రతివాడున్ను తాను వర్ధిల్లినకొలది తన యొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను."

మొదటి క్రైస్తవులు అపొస్తలుల బోధయందును, ప్రార్ధనయందును, సహవాసమందును, రొట్టె విరుచుట యందును యెడతెగక యుండిరని ఇదివరకే మనము నేర్చుకొంటిమి. వారట్లు ఆరాధన చేయుటకు కూడివచ్చినప్పుడు కానుకలను కూడ ఇయ్యవలెనని పౌలు ఇక్కడ బోధించుచున్నాడు. ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును కానుకల నియ్యవలెనని అతడు బోధించుచున్నాడు. అయితే ఆదివారము ననే ఎందుకు ఈయవలెను? క్రైస్తవు లందరును ఆయన నారాధించు టకు ఆదివారముననే కూడు కొనుటచే కానుక లిచ్చుటకు కూడ ఆదినమే అనుకూలమై యున్నది. దేవునికి కానుకల నిచ్చుట ఆరాధనలో ఒక భాగమై యున్నది. అందువలన ఆరాధన సమయములో కానుకల నీయవలెను. అది ఆదివారమున జరుగవలెను.

యూదులైతే దశమభాగములను దేవుని కర్పించిరి కదా, మరి క్రైస్తవులు ఎంత అర్పించవలెను? అనే ప్రశ్న మీకు రావచ్చును. యూదుల నుండి దశమ భాగములను దేవుడు ఆజ్ఞాపించి రాబట్టెను. క్రైస్తవులనయితే మీరు మీ రాబడిలో ఇన్నోవంతు అర్పించుడి అని ఆయన ఆజ్ఞాపించుట లేదు. గాని యూదుల కంటె శ్రేష్ఠమైన కృపాయుగములో, క్రీస్తు యుగములో మనము జీవించుచున్నాము గనుక, వారికంటె ఎక్కువ ఇయ్యబద్ధులమై యున్నాము. మనము కానుకల నిచ్చునప్పుడు ఉత్సాహముగా ఇయ్య వలెనని వాక్యము బోధించుచున్నది. మనము వర్ధిల్లిన కొలది ఇయ్యవలెను. సణుగుకొనకయు, బలవంతముగా కాకయు, హృదయములో నిశ్చయించు కొనిన ప్రకారము ఇయ్యవలెను. అపొస్తలుడైన పౌలు 2 కొరింధి 8:9-12లో ఇట్లనుచున్నాడు: "మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురుగదా? ఆయన ధనవంతుడై యుండియు మీరు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని, మీ నిమిత్తము దరిద్రుడాయెను..... మొదట ఒకడు సిద్ధమైన మనస్సు కలిగియుంటే శక్తికి మించికాదు

గాని కలిమికొలదియే యిచ్చినది ప్రీతికరమవును." మరల 2 కొరింథి 9:6-11లో అతడిట్లు వ్రాసెను: "కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంటకోయును; సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంటకోయును అని యీ విషయమై చెప్పవచ్చును. సణుగుకొన కయు, బలవంతముగా కాకయు ప్రతి వాడును తన హృదయములో నిశ్చ యించుకొనిన ప్రకారము ఇయ్యవలెను; దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును. మరియు అన్నిటియందు ఎల్లప్పుడు మీలో మీరు సర్వ సమృద్ధి గలవారై ఉత్తమమైన ప్రతికార్యము చేయుటకు దేవుడు మీ యెడల సమస్త విధములైన కృపను విస్తరింప చేయగలడు ..... విత్తువానికి విత్తనమును తినుటకు ఆహారమును దయచేయు దేవుడు విత్తనము దయచేసి విస్తరింప చేసి, మీరు ప్రతి విషయములో పూర్ణౌదార్య భాగ్యము గలవారగునట్లు మీ నీతి ఫలముల వృద్ధి పొందించును".

యధార్థముగా దేవుని ఆరాధించువారు, వారి ధనధాన్యము కంటె ముందు తమ్మును తాము దేవునికి సమర్పించుకొనవలెను. మాసిదోనియ లోనున్న క్రీస్తు సంఘస్థులు తమ్మును తామే అప్పగించుకొనిరియని పౌలు వారిని గూర్చి సాక్ష్యమిచ్చుచున్నాడు. "సహోదరులారా, మాసిదోనియ సంఘము లకు అనుగ్రహింపబడి యున్న దేవుని కృపను గూర్చి మీకు తెలియజేయు చున్నాము. ఏలాగనగా వారు బహు శ్రమవలన పరీక్షింపబడగా అత్య ధికముగా సంతోషించిరి. మరియు వారు నిరుపేదలైనను వారి దాతృత్వము బహుగా విస్తరించెను.....వారు తమ సామర్థ్యము కొలదియేగాక సామర్థ్యము కంటె ఎక్కువగాను తమంతట తామే యిచ్చిరని మీకు సాక్ష్యమిచ్చుచున్నాను. ఇదియుగాక మొదట ప్రభువునకును, దేవుని చిత్తము వలన మాకును తమ్మును తామే అప్పగించు కొనిరి" యని అతడు వారిని గూర్చి సాక్ష్యమిచ్చుచున్నాడు (2 కొరింథి 8:1-5). "కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును, దేవునికి అనుకూలమునైన సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలు కొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది" (రోమా 12:1).

సంఘము ద్వారా దేవుని సేవ జయప్రదముగా జరుగునట్లు ప్రతి క్రైస్తవుడు ఇయ్యవలెను. "ఇయ్యుడి, అప్పుడు మీకియ్యబడును; అణచి,

కుదిలించి, దిగజారునట్లు నిండు కొలత ను మనుష్యులు మీ ఒడిలో కొలుతురు. మీరు ఏ కొలతతో కొలుతురో ఆ కొలతతోనే మీకు మరల కొలువబడునని "యేసు చెప్పెను (లూకా:38). గనుక "మనము మేలు చేయుటయందు విసుగక యుందము. మనము అలయక మేలు చేసితిమేని తగిన కాలమందు పంట కోతుము. కాబట్టి మనకు సమయము దొరికిన కొలది అందరియెడల విశేష ముగా విశ్వాస గృహమునకు చేరిన వారియెడలను మేలు చేయుదము" (గలతీ 6: 10).

దేవుడు మనలను ప్రేమించి తన కుమారుని మనకొరకు బలియిచ్చెను. మన కానుకల ద్వారాను, మన శరీరార్ప ణము ద్వారాను దేవునికి మనము కృతజ్ఞత చెల్లించబద్ధులమై యున్నాము. క్రీస్తు సంఘములో మనము జతపని వారము గనుక సంఘాభివృద్ధి విషయములోను, సువార్త వ్యాప్తి విషయములోను మన బాధ్యతను నిర్వర్తించ బద్ధులమై యున్నాము. అందువలన మన కానుకలను ఉత్సాహ ముతో దేవునికి సమర్పించుట ద్వారా ఆయనను ఆత్మతోను, సత్యము తోను ఆరాధించెదముగాక !!

# వేషధారుని నిరీక్షణ

## (The Hypocrit's Hope)

వేషధారుని గూర్చి యోబు 27:8 లో యిట్లున్నది: "దేవుడు వాని కొట్టివేయు నప్పుడు వాని ప్రాణము తీసి వేయు నప్పుడు భక్తిహీనునికి ఆధార మేది?" ఈ వచనం భక్తిహీనతను గూర్చి చెప్పుచున్నది. వేషధారణ లేక భక్తిహీనత యేమిటి? భక్తిహీనతకు హెబ్రీభాషలో, "దైవదూషణ కరమైన, లేక దేవుడులేని" యను భావము కలదు; గ్రీకు భాషలో ఒకనాటికలో నటించుట యను భావము కలదు. ఒకటి చెప్పి ఇంకొకటి చేయువానిని మనం వేషధారుడనవచ్చును. అతడు కాని దానిని ఉన్నట్లు నటిస్తాడు.

వేషధారులు ఏమిచేస్తారు? బైబిలు ఏమి చెప్పుచున్నది? మత్తయి 7:1-5ను బట్టి యితరులు ఏ చిన్న తప్పు చేసినా వేషధారులు దానిని వెంటనే వ్రేలెత్తి చూపిస్తారు, గాని వారు చేసే తప్పులు చాలా ఘోరమైనవి. అందు వలన యేసు, "వేషధారీ, మొదట నీ

కంటిలో నున్న దూలమును తీసివేసి కొనుము, అప్పుడు నీ సహోదరుని కంటిలో నున్న నలుసును తీసివేయుటకు నీకు తేటగా కనుబడునని" చెప్పెను (మత్తయి 7:5). వేషధారులు తమ జీవితంలో యున్న ఘోర తప్పిదములను నిర్లక్ష్యము చేసి తమ పొరుగువారి జీవితంలోని సూక్ష్మ తప్పిదములను ఎత్తి చూపిస్తారు. నిజానికి ఇతరుల పాపములను గూర్చి చెప్పువారు, తమ పాపములను గూర్చి ప్రజలను దారి మళ్లించుటకు ప్రయత్నించుదురని నేను గమనించాను !

శాస్త్రులు పరిసయ్యులు ప్రజలు దేవుని రాజ్యములోనికి అడ్డకొను చున్నందున యేసువారిని వేషధారులని పిలిచెను. వారు పరలోక రాజ్యములో ప్రవేశింపరు, ప్రవేశించువారిని ప్రవేశింపనియ్యరు (మత్తయి 23:14). సంఘమునకు వెలుపల, లోపల యున్న వేషధారణను బట్టి అనేకులు దేవుని రాజ్యద్వారము నుండి మరలిపోయారు. ఎంత విచారము! క్రైస్తవేతరులు క్రైస్తవులను గూర్చి లేనిపోని మాటలాడుదురు. అట్టి మాటలవలన అనేకులు క్రీస్తుకు, ఆయన సంఘమునకు దూరమయ్యారు. వారు దేవుని రాజ్యములో లేరు, యితరులు కూడా దానిలో ప్రవేశింపనీయరు. అయితే సంఘసభ్యుల వేషధారణ కూడా అనేకు లను అపవాది యొక్క నరక ద్వారము నకు నడిపించింది. సువార్తకు తగిన ట్టుగా నడుచుకొను క్రైస్తవులుంటే ఎంత బావుండును! (ఫిలిప్పీ 1:27). మన రక్షకుడగు దేవుని ఉపదేశమును అలంక రించుకొను పరిశుద్ధులు మనకవు సరము (తీతు 2:9). నమ్మకమైన క్రైస్తవుల జీవితాన్ని బట్టి క్రైస్తవేతరులు అకర్షింప బడుదురు (అపొ.కా. 2:47).

వేషధారులు కూడ వారిలో వారు అభివృద్ధి జెందుదురు. తమలో ఒకని కలుపుకొనడానికి భూమిని సముద్ర మును చుట్టివచ్చు శాస్త్రులను పరిస య్యులను యేసు ఖండించెను (మత్త 23:15). సాతానుడు సమయాన్ని మించి పనిచేయుచున్నట్లగు పడుచున్నాడు. వేషధారులు పెరిగిపోతున్నారు. మొదటి శతాబ్దములోవలే క్రైస్తవులు విస్తరించుట లేదు. ఆదిమ సంఘము దిన దినము సంఖ్యలో విస్తరించెను (అపొ.కా. 16:5; 6:7).

వేషధారులు యేమి చేస్తారు? వారు కానిదాన్ని ఉన్నట్లు నటిస్తారు. "దేవుని ఎరుగుదుమని వారు చెప్పు కొందురు గాని, అసహ్యులును అవిధే యులును ప్రతి సత్కార్యము విషయ

ము భ్రష్టులునై యుండి తమ క్రియల వలన ఆయనను ఎరుగమన్న ట్టున్నారు" అని తీతు 1:16లో వ్రాయబడి యున్నది. అట్టివారు "పైకి భక్తిగల వారివలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించని వారునై యుందురు" (2 తిమో 3:5). వారు క్రీస్తును వెంబ డించుచున్నామని తలంచుచు నిజానికి సాతానును వెంబ డించుదురు. ఎంత విచారము! "నేను చెప్పు మాటల ప్రకారము మీరు చేయక - ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు?" అని యేసు ప్రభువు అడిగారు (లూకా 6:46).

రెండవదిగా, వేషధారణ లేకుండుట అత్యావసరమని గమనించు దాం. శాస్త్రులు పరిసయ్యులు చెప్పేవారే గాని చేసేవారు కాదు. మనం వారివలె యుండరాదు (మత్తయి 23:3). మనం పరలోక రాజ్యములో ప్రవేశించాలంటే మన నీతి శాస్త్రులు నీతికంటెను పరిసయ్యులు నీతికంటెను అధికముగా యుండాలి (మత్తయి 5:20).

"మీ ప్రేమ నిష్కపటమైనదై యుండవలెను" అని పౌలు చెప్పాడు (రోమా 12:9). అంటే మన ప్రేమ వేషధారణ లేనిదై యుండాలి. మనం కపటమును, వేషధారణను మాని వేయాలని పేతురు చెప్పాడు (1 పేతురు 2:1). తిమోతి తన అవ్వలో, తల్లిలో యుండినట్టి నిష్కపటమైన విశ్వాసమును కలిగి యుండాలని పౌలు హెచ్చరించాడు (2తిమో 1:5; 1తిమో 1:5). తోటి సహోదరుల యెడల మనం నిష్కపటమైన ప్రేమ కలిగియుండాలని పేతురు హెచ్చరించాడు (1 పేతురు 1:22). అంటే వేషధారణలేని ప్రేమ కలిగి యుండాలి.

## యేసు నీ యింటికి వచ్చిన యెడల

ఒకటి రెండు దినాల మట్టుకు యేసు నీయింటికి వస్తే
అనుకొనకుండా ఆయన వస్తే నీ వేమి చేస్తావు ?
ఆయన రావడం చూచి, చేతులు చాచి ఆ పరలోక అతిథిని
నీ గుమ్మము దగ్గరే ఎదుర్కొందువా? లేదా ఆయనను
లోనికి ఆహ్వానించకముందు కొన్ని మేగజైనులు కాల్చివేసి
బైబిలును ముందుంచి, కొన్ని సంగతులను అటు యిటు మార్చి
ఆయనను లోపలికి రమ్మంటావా ?

అంత ప్రఖ్యాత అతిథికి నీ యింటిలో మంచి గదినే యిస్తావని నాకు తెలుసు ఆయనకు ప్రతిపూట రుచిగల వంటకాలనే వడ్డిస్తావు; మరియు ఆయన నీ యింటికి వచ్చినందుకు చాల సంతోషం అని పదేపదే చెప్తావు ఆయనకు సేవ చేయడం మరింత గొప్ప భాగ్యం అని చెప్తావు. కాని నీ యింట్లో సంభాషణ ఎట్లుంటాది? భోజనం దగ్గర ప్రతిసారి కృతజ్ఞత చెల్లించడం కష్టమవుతాదా?

ఆయన నిరంతరం నీ యింట్లో వుండడానికి సంతోషిస్తావా? లేదా ఆయన చివరకు వెళ్లిపోయినప్పుడు అమ్మయ్య! అని వూపిరి పీల్చుకొంటావా? నిజానికి యేసు నీతో కాలం గడపడానికి వస్తే నీవేమి చేస్తావో తెలిసికొనడం మంచిదే.

మూడవదిగా, యేసు యిచ్చిన వేషధారుల వర్ణను గమనించుదాం. వారు గ్రుడ్డివారైన మార్గదర్శకులని ఆయన చెప్పారు (మత్తయి 23:16). వారిని అవివేకులని ఆయన పిలిచారు (మత్తయి 23:17). వారు సున్నము కొట్టిన సమాధులని ఆయన పోల్చారు. అవి వెలుపల శృంగారముగా అగపడును గాని లోపల చచ్చినవారి యెముకలతోను సమస్త కల్మషముతోను నిండి యుంటాయి (మత్త 23:27). వారిని నరక కుమారులని కూడ ఆయన పిలిచారు (మత్త23:15).సర్పములారా, సర్పసంతానమా యని ఆయన వారిని పిలిచారు (మత్త 23:33). యేసు ఉపయోగించిన కఠిన పదజాలము వేషధారులను వర్ణించుటకాయన ఉపయోగించెను. వేషధారులను గూర్చి, నటించేవారిని గూర్చి, నకిలీలను గూర్చిన ఆయన మనస్సు మనకు విదితమే.

నాల్గవదిగా, వేషధారుల నిరీక్షణను గమనించుదాం. "భక్తిహీనుని ఆశ నిరర్ధకమగునని" యోబు 8:13 చెప్పుచున్నది. భక్తిహీనునికి, వేషధారునికి నిరీక్షణేలేదని మనపాఠ్య భాగవచనం చెప్పుచున్నది. ఏలయనగా దేవుడు వాని ఆత్మను కొట్టివేయును (యోబు 27:8). వేషధారులు ఈ లోకంలో ఎంత సంపాదించుకొనినను అదంతయు వ్యర్ధమే. "ఒకడు ఈ లోకము నంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటేఅతనికేమి ప్రయోజ

నము? ఒక మనుష్యుడు తన ప్రాణము నకు ప్రతిగానేమి యియ్యగలడు?" అని యేసు అడిగెను (మత్తయి 16:26). వేషధారులు నరశిక్షను తప్పించుకొనలేరని యేసు చెప్పెను (మత్త 23:33).

చివరిగా, క్రైస్తవులు నమ్మకమైన యదార్ధమైన నిజ క్రైస్తవ జీవితాన్ని జీవించాలి. ఇది ఎంతో అవుసరం. దేవుని పరిశుద్ధుల జీవితంలో వేషధారణకు తావే లేదు.

- జాన్ స్టేసీ

ఉపమానమాలిక :

# తప్పిపోయిన కుమారుడు

## (The Prodigal Son)

### లూకా *15 : 11-24*

లూకా సువార్తలో 15వ అధ్యాయంలో యేసు చెప్పిన మూడు ఉపమానములు వ్రాయబడి యున్నవి : తప్పిపోయిన గొర్రె, పోగొట్టుకొనిన నాణెము, తప్పిపోయిన కుమారుడు. ఆనాటి శాస్త్రులు, పరిసయ్యులు యేసు పాపులను చేర్చుకొని వారితో కూడ భోజనము చేయుచున్నాడని చాల సణుగు కొనగా ఆయన ఈ ఉపమానముల రీతిగా వారికి బోధించారు. పాపములో బడి నశించిన వారిని వెదకి రక్షించడానికి ఆయన వచ్చారని వారికి తెలియజేయ గోరారు. పాపియొక్క మనఃపరివర్తనను గూర్చి ఆసక్తితో ఎదురు చూచుచున్న తండ్రియైన దేవుని ప్రేమను, పావములో పడి నశించువాని పరిస్థితిని, అతడు మారు మనస్సు బొందితే కలుగు గొప్ప ఆనందమును తప్పిపోయిన కుమారుని కథనము మనకు వర్ణించుచున్నది.

"ఒక మనుష్యునికి ఇద్దరు కుమారులుండిరి. వారిలో చిన్నవాడు - తండ్రి ఆస్థిలో నాకు వచ్చు భాగమిమ్మని తన తండ్రినడుగగా అతడు వానికి తన ఆస్థిని పంచిపెట్టెను. కొన్ని దినములైన తరువాత ఆ చిన్న కుమారుడు సమస్తమును కూర్చుకొని దూరదేశమునకు ప్రయాణమైపోయి అచ్చట తన ఆస్తిని దుర్వ్యాపారము వలన పాడుచేసెను. అదంతయు ఖర్చు చేసిన తరువాత ఆ దేశమందు గొప్ప కరువు రాగా వాడు ఇబ్బంది పడసాగి వెళ్లి ఆ దేశస్థులలో ఒకని చెంత చేరెను. అతడు పందులను

మేపుటకు తన పొలములలోనికి వానిని పంపెను. వాడు పందులు తిను పొట్టుతో తన కడుపు నింపుకొన ఆశపడెను గాని యెవడును వానికేమియు ఇయ్యలేదు. అయితే బుద్ధి వచ్చినప్పుడు వాడు - నా తండ్రి యొద్ద ఎంతో మంది కూలి వాండ్రకు అన్నము సమృద్ధిగా ఉన్నది, నేనైతే ఇక్కడ ఆకలికి చచ్చిపోవుచున్నాను. నేను లేచి నా తండ్రి యొద్దకు వెళ్లి - తండ్రీ నేను పరలోకమునకు విరోధముగాను నీ యెదుటను పాపము చేసితిని; ఇక మీదట నీ కుమారుడనని అనిపించు కొనుటకు యోగ్యుడనుకాను; నన్ను నీ కూలివారిలో ఒకనిగా పెట్టు కొనుమని అతనితో చెప్పుదునను కొని, లేచి తండ్రి యొద్దకు వచ్చెను. వాడింక దూరముగా ఉన్నప్పుడు తండ్రి వానిని చూచి కనికర పడి పరుగెత్తి వాని మెడమీద పడి ముద్దు పెట్టుకొనెను. అప్పుడు ఆ కుమారుడు ఆతనితో, తండ్రీ నేను పరలోకమునకు విరోధముగానునీ యెదుటను పాపము చేసితిని; ఇక మీదట నీ కుమారుడనని అనిపించు కొనుటకు యోగ్యుడను కాననెను. అయితే తండ్రి తన దాసులను చూచి - ప్రశస్త వస్త్రము త్వరగా తెచ్చి వీనికి కట్టి, వీని చేతికి ఉంగరము పెట్టి పాదములకు చెప్పులు తొడిగించుడి. క్రొవ్విన దూడను తెచ్చి వధించుడి, మనము తిని సంతోష పడుదుము; ఈ నా కుమారుడు చనిపోయి మరల బ్రతికెను, తప్పిపోయిన దొరకెనని చెప్పెను. అంతట వారు సంతోష పడసాగిరి" (లూకా 15:11-24).

యేసు చెప్పిన ఈ గొప్ప ఉపమానములో తండ్రి - తండ్రియైన దేవునిని, పెద్ద కుమారుడు పరిసయ్యులను శాస్త్రులను, చిన్న కుమారుడు పాపులను సుంకరులను సూచించు చున్నారు. మరియు పాపములో బడి నశించుచున్న వారిని రక్షించుటకు దేవుని యొక్క ఆసక్తిని ఈ ఉపమానము బోధించుచున్నది.

పాపము ఎన్నడు స్థిమితముగా యుండదు. అది తండ్రియైన దేవుని నుండి దూరముగా పోవాలని ప్రేరేపిస్తాది. చిన్నవాడు ఆస్థిలో తనకు వచ్చు భాగాన్ని పంచి ఇమ్మని కోరగా తండ్రి పంచి యిచ్చాడు. కొన్ని దినములలోగా ఈ చిన్న వాడు తన ఆస్థిని అమ్ముకొని డబ్బుగా మార్చుకొని దూరదేశమునకు ప్రయాణమై పోయాడు. అతడు తన తండ్రి అధికారము నుండి దూరముగా పోవాలనుకొన్నాడు. తన స్వేచ్ఛను బట్టి నడుచుకోవాలను కొన్నాడు. ఒక్కొక్క అడుగు వేసుకుంటూ తండ్రి నుండి దూరమై పోయాడు.

పాపముచేయు ప్రతివాడు అంతే... తండ్రియైన దేవుని నుండి తొలగిపోతాడు. ఒక్కొక్క అడుగు పాపములోనికి వేసు కొంటూ ఆయన అధికారము నుండి దూరమైపోతాడు. మానవుడు ఎక్కడు న్నను దేవుని చిత్తానికి వ్యతిరేకముగా జీవించుచుంటే అతడా యననుండి దూరమైపోయినవాడే అవుతాడు. ఈ చిన్న కుమారుడు బహుశ అన్యజనుల దేశము నకు పోయాడు (15 వచనము).

అతడు దూరదేశమునకు ప్రయా ణమైపోయి అచ్చట తన ఆస్తిని దుర్వ్యా పారము వలన పాడు చేసాడు. పాపము వలన ఎన్నడు ఏది కలిసిరాదు, దానివలన కలిగే లాభం యేమీ లేదు. పాపము ఎల్లప్పుడు పాడుచేస్తాది. "పాపము వలన వచ్చు జీతము మరణము"(రోమా 6:23). అతడు దుర్వ్యా పారమువలన, దురల వాట్లకు, దుష్ట సాంగత్యానికి లోనై తన డబ్బును పాడుచేసాడు. వేలకొలది ప్రజలు నేడు ఇట్టి జీవితాన్ని జీవించుచున్నారు. తమ జీవితాలను పాడుచేసుకొనడమే వారి ధ్యేయం వలె వారు ప్రవర్తిస్తారు. ఈ చిన్నవాడు "అదంతయు ఖర్చుచేసిన తరువాత" అని చెప్పబడింది. అతని డబ్బు, ఆత్మ గౌరవం, మంచి పేరు, ఆరోగ్యము మొదలగునదంతయు వాడు ఖర్చు చేసేసాడు. అతనికున్న సమస్తము ఖర్చయిపోయింది గాని అతని యెడల తన తండ్రికున్న ప్రేమ మాత్రం ఖర్చు కాలేదు.

అదంతయు ఖర్చు చేసిన తరువాత ఆదేశమందు గొప్ప కరువు రాగా, వాడు ఇబ్బంది పడసాగాడు. అతని దగ్గర డబ్బు బాగా యున్నప్పుడు నానావిధాలైన స్నేహితులుండిరి. గాని అదంతా ఖర్చయిపోగానే వారుకూడ ఇతనిని విసర్జించారు. అతని ఇబ్బందిలో ఆదుకొనేవాడు ఒక్కడుకూడ లేక పోయాడు. అతడు వెళ్లి బానిసగా ఒకని యొద్ద చేరాడు : అతడు పందులను మేపుటకు తన పొలములోనికి వానిని పంపాడు. పందులను మేపే పని యూదునికి చాల అవమానకరమైనది. పాపము అంత అవమానకరమైన పనులు చేయిస్తాది. వాడు చివరకు పందులు తిను పొట్టుతో తనకడుపు నింపుకొనగోరాడు గాని యెవడును వాని కేమియు ఇయ్యలేదు. ఎంత హీన కరమైన పరిస్థితి!

అయితే బుద్ధి వచ్చినప్పుడు తన పూర్వ స్థితిని గూర్చి తండ్రిని గూర్చి ఆలోచింపసాగాడు. పాపము ఒకనిని తని నిజస్థితి నుండి దూరపరుస్తాది. పందులను మేపుతు ఇతడు ఆలోచింప సాగాడు. ఒక నిశ్చయతకు వచ్చాడు :

"నేను లేచి నా తండ్రి నాతండ్రియొద్దకు వెళ్లి, తండ్రీ నేను పరలోకమునకు విరోధముగాను నీయెదుటను పాపము చేసితిని; ఇక మీదట నీకుమారుడని అనిపించుకొనుటకు యోగ్యుడనుకాను; నన్ను నీ కూలివారిలో ఒకనిగా పెట్టుకొనుమని అతనితో చెప్పుదుననుకొని, లేచి తండ్రి యొద్దకు వచ్చాడు." ఇతనిలో ఎంత మార్పు వచ్చినదో. ముందు నాకు వచ్చేది ఇచ్చేసేయి అని అడిగాడు. ఇప్పుడైతే యోగ్యుడను కానుగాని నీ కూలి వానిగా చేసుకో అని అడుగుచున్నాడు. అతడు ధనికుడుగా తండ్రి యొద్దనుండి పోయాడు, దరిద్రుడుగా తిరిగివచ్చాడు. వాడింక దూరముగా ఉన్నప్పుడు తండ్రి వానిని చూచి కనికరపడి, పరుగెత్తి వాని మెడమీదపడి ముద్దు పెట్టుకొన్నాడు. తండ్రి ప్రేమ ఎంత ఆశ్చర్యకరమైనది ! ఆయన తప్పిపోయిన కుమారుని కొరకు ప్రతి దినము నిరీక్షించుచున్నాడు, నేను కుమారుడనిపించుకొనుటకు యోగ్యుడను కాను అని అతడు చెబుతుంటే తండ్రి అతనికి ప్రశస్త వస్త్రము తొడిగించాడు - కుమారత్వాన్ని మరల అనుగ్రహించాడు; వాని చేతికి ఉంగరము పెట్టాడు, అంటే అనంతమైన ప్రేమను ప్రసాదించాడు, పాదములకు చెప్పులు తొడిగించాడు, అతని ఘనతను తిరిగి యిచ్చాడు. గొప్ప విందు చేసి సంతోషించాడు. మారు మనస్సు పొందిన మానవుని గూర్చిన దేవుని సంతోషము పట్టలేనిది.

పాపంచేయు ప్రతివాడు తప్పిపోయిన కుమారుడే. అతని రాకకై తండ్రియైన దేవుడు ప్రేమతో వీక్షించుచున్నాడు. నీవు పాపివైన యెడల ఈనాడే తండ్రి యొద్దకు తిరిగి రమ్ము. యేసు ప్రభువునందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు బొంది ఆయన నామమును ఒప్పుకొని పాప క్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందుము. సంతోషంతో ఆయన నిన్ను చేర్చుకొంటాడు !!

✍ - జాషువా గూటం

క్రీస్తు సంఘములు సమర్పించు "సత్యవాణి" టి.వి. కార్యక్రమమును ప్రతి శనివారం ఉదయం6:30 నుండి 7:00 వరకు తేజ ఛానల్‌లో చూడండి.
మీ బంధుమిత్రులతో కలిసి సువార్తను వినండి.

# మారుమనస్సు కఠినమైన ఆజ్ఞా ?

(Repentance, The hardest command ?)

బైబిలు చేయుబోధలలో,పాపముల విషయమై మారుమనస్సు గూర్చిన మన బాధ్యతను చాల తక్కువ గ్రహించు కొనుచున్నాము. బైబిలు దిగువ సంగతులను ప్రకటించుచున్నది : 1. మానవ జీవనంలో పాపం ఒక వాస్తవం. 2. ప్రతివాడు మారుమనస్సు పొందాలి. ఆదాము హవ్వల నుండి ఇశ్రాయేలీయులు నేర్చుకోవలసిన మొదటి పాఠం అది (ఆది.కా. 2,3). మానవ చరిత్ర అంతటిలోను ఆది నుండి అంతము వరకు పాపముల విషయమైన మారుమనస్సును గూర్చి బైబిలు చెప్పుచున్నది. పాపులు మారుమనస్సు పొందవలెనని ఆజ్ఞాపించుచున్నది మరియు ప్రజలు మారుమనస్సు పొంద బాధ్యులని ప్రకటించు చున్నది.

మానవుడు మారుమనస్సు పొందగా దేవుని పై దాని ప్రభావమును లేఖనములు తెలియజేయుచున్నవి. ఒకని జీవితంలో యున్న పాపముల క్షమింపబడుటకు మారుమనస్సు అత్యవసరం (అపొ.కా. 2:38). ఒకని పాపములు తుడిచి వేయబడాలన్నా, ప్రభువు సముఖమున విశ్రాంతి పొందాలన్నా అతడు మారు మనస్సు పొందాలి (అపొ.కా. 3:19).

మారుమనస్సు అనగా యేమిటో తెలిసికోకుండా ఒకడు మారుమనస్సు ఎట్లు పొందుతాడు? యేసు ప్రభువు, అపొస్తలులు, క్రొత్త నిబంధన లేఖనములు బోధించిన మారు మనస్సు ను గూర్చి తెలిసికోకుండా ఒకడు మారు మనస్సు ఎట్లు పొందు తాడు? మారు మనస్సును అర్థం చేసికోవాలి! మారు మనస్సు లేకుండా విశ్వాసము బాప్తిస్మము అనునవి వ్యర్థమే, అవి క్రీస్తులో క్రొత్త జీవితాన్ని కలుగజేయనేరవు.

మారుమనస్సు అనగా నీ జీవితమును మార్చుకొనుట. నీ జీవితాన్ని పాపమునుండి మళ్లించి దేవుని వైపుకు త్రిప్పుటయని అర్థము. మారుమనస్సు నీ హృదయ పరిస్థితిని మార్చుటకు నడిపించునట్లు మనస్సును మార్చుకొనుట. అది నీ జీవితాన్ని మార్చుటకు సహకరించుటలో నీ ప్రవర్తనను మార్చుకొనుట యని ఒకరు చెప్పారు.ఇదంతయు సత్యమే. అయితేనీ దైనందిన చర్యలలో దాని అర్థము నెరుగుదువా?

తప్పిపోయిన కుమారుని ఉపమా

నములో యేసు మారుమనస్సు యొక్క అర్థాన్ని వివరించారు (లూకా 15:11-24). ఒక మనుష్యుని చిన్న కుమారుడు తనకు వయసు రాగానే, తన తండ్రి యొక్కయు అన్న యొక్కయు అధీనము నుండి తప్పు కోవాలను కొన్నాడు. అతని యువక వయస్సు, అహంభావము అట్లు నడిపించాయి. ఆస్థిలో తనకు వచ్చు భాగము నడిగి దానిని పొంది అతడు దూర దేశమునకు పోయాడు. అతడు తన ఆస్థినంతటిని దుర్వ్యాపారము వలన పాడు చేసి కొనెను. అదంతయు ఖర్చు అయి పోయిన తరువాత ఆదేశములో గొప్ప కరువు సంభవింపగా అతనికి తినుటకు ఎవడును ఏమియు ఇయ్యకపోయెను. అతడు యూదుడై యుండియు హేయమైన పందులు మేపు ఉద్యోగమునకు కుదిరెను (లేవి 11:2, 4,7,8). ఆకలికి తట్టుకొనలేక అతడు పందులు తినుపొట్టుతో తన కడుపును నింపు కొనగోరెను.

అట్టి అత్యవసర పరిస్థితిలో అతడు బుద్ధి తెచ్చుకొన్నాడు. తన కంటే తన తండ్రి సేవకులు మంచి స్థితిలో యున్నారని అతడు గ్రహించుకొనెను. అతడు తన తప్పులను గూర్చితానే బాధ్యుడనని గ్రహించుకొనెను. ఆ క్షణం లోనే అతడు దేవునికిని తన తండ్రికిని విరోధముగా పాపము చేసెనని గ్రహించుకొనెను. దాని నుండి బయట పడడానికి నిశ్చయించుకొనెను.

అది కఠినమైన నిర్ణయం! అతడు లేచి తండ్రియొద్దకు వెళ్లి తన పాపము నొప్పుకొని, సేవకులలో ఒకనిగా చేర్చు కొనుమని అడుగుటకు నిశ్చయించుకొనెను. అట్టి విన్నపము చేయుటకు అతనికి హక్కేమియు లేదు. కుమారునిగా యుండే అర్హత అతడు కోల్పోయాడు. అయితే అతడు తిరుగు ప్రయాణం మొదలెట్టాడు. అది సుదీర్ఘ ప్రయాణం, అతని తండ్రి అతనిని అంగీక రిస్తాడా? అతని ఆకలి తీరునా? తండ్రి అతని గూర్చి సిగ్గు పడునా? సేవకులలో ఒకనిగానైనా చేర్చు కొనునా? ఫలితమేలాగున్ననూసరే, అతడు లేచి తిరిగి వెళ్లాడు.

మారుమనస్సు యొక్క శక్తివంతమైన వర్ణనయిది. మారుమనస్సును ఈ కథనము చక్కగా చిత్రీకరించుచున్నది. అతడు తన్నుతాను మోసగించుకొనుట ముగించుకొని తన జీవిత నిజపరిస్థితిని సరిగా అంచనా వేసుకొన్నాడు, తన పాపమును, అపజయమును, పొరబాట్లను గ్రహించుకొన్నాడు, తన నిర్ణయాలను బట్టే తన జీవితంలో పాపము ప్రవేశించిందనే సత్యాన్ని అంగీకరించాడు. తన ప్రవర్తన విషయమైన తన భాధ్యతను పూర్తిగా

అంగీకరించాడు. తన దుష్క్రియవలన తన తండ్రికి, దేవునికి వేదన కలిగించానని అంగీకరించాడు. అతని పనికిమాలిన ప్రవర్తనను మార్చుకొన్నాడు. పందుల పాకలో నుండి బయట పడ్డాడు. యింటికి చేరుకొన్నాడు, తననుగూర్చిన సత్యాన్ని ఒప్పుకొన్నాడు.

మనలను క్షమించే దేవుని తత్వాన్ని తండ్రిలో మనకు ప్రగాఢంగా హత్తుకొనే లాగ వర్ణించబడింది. చిన్న కుమారుడు యింటిని విడిచి వెళ్లిన నాటి నుండి తండ్రి అతని కొరకు అనుదినం కనిపెట్టుచూనే యున్నాడు. దూరమున చింపిరి గుడ్డలతో అతడు కనబడగానే, తండ్రి అతన్ని గుర్తుపట్టాడు, అతడు పరుగెత్తికొని వెళ్లాడు, ప్రేమతో అతని మెడమీద పడి ముద్దు పెట్టుకొన్నాడు, కౌగిలించుకొన్నాడు. కుమారుడు చేస్తున్న పాపపు టొప్పుకోలును సరిగ్గా విన్నాడో లేదో తెలియదు గాని కుమారుని మారు మనస్సు యదార్థం అని అతడెరుగును! అతన్ని కుమారునివలె అంగీకరించాడు, కుమారత్వాన్ని మరల ప్రతిష్టించాడు. గొప్ప విందు చేయించాడు. ఏలయనగా చనిపోయిన అతని కుమారుడు మరల బ్రదికాడు !

అదీ మారుమనస్సు. మన మారు మనస్సు యొక్క ప్రభావం దేవుని మీద అంత ఉంటాది. అది నీ జీవితంలో కూడ సంభవిస్తాది - నీవు మారు మనస్సు పొందినప్పుడు !!

- డేవిడ్ ఛాడ్వెల్

# దేవుడు మనతో ఉన్నాడు

## (God with us)

దేవునికి మానవులతో ఉండాలనేదే కోరిక. ఈ ఉద్దేశము మానవుని సృజించిన నాటి నుండి దేవునికి ఉన్నట్లు లేఖనములు తెలుపుచున్నవి. దేవునితో మానవుడు నివసించుట వ్యక్తిగతముగాను సామాజికముగాను సాధ్యమే యన్నది సత్యము. అయితే ఈ రెండు విధానములు సన్నిహిత సంబంధము కలిగి యున్నవి. దేవుని సన్నిధిని ఆయన ప్రజల మధ్య తెలిసికొనుట, వ్యక్తిగతముగా ఆయన సన్నిధిని అనుభవించుటపై ఆధారపడి యుంటుంది. దేవుని సన్నిధిని వ్యక్తిగతముగా ఎంత మేరకు అనుభవించగలమో, అంతమేరకు మాత్రమే ఆయన

సన్నిధిని సామూహికముగా అనుభవించ గలము.

మనుష్యులతో నివాసము చేయ వలెనను కోరిక, ఉద్దేశము దేవుని కుమారుని అవతారము ద్వారా విశిష్ఠతను సంతరించుకొనినది.

"ఆయనకు ఇమ్మానుయేలను పేరు పెట్టుదురు................ ఇమ్మానుయేలను పేరునకు దేవుడు మనకు తోడని అర్థము" (మత్తయి 1:22, 23) ఆలకించుడి కన్యక గర్భవతియై కుమారునికని అతనికి ఇమ్మానుయేలను పేరుపెట్టును. (యెషయా 7:14.) "ఆ వాక్యము శరీర ధారియై, కృపా సత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను; యోహాను 1:14, ప్రత్యక్ష గుడారమును, దేవాలయమును కట్టుట ద్వారా ఈ సంగతి పూర్వమే బయలు పరచబడినది.

"నేను వారిలో నివసించునట్లు వారు నాకు పరిశుద్ధ స్థలమును నిర్మింప వలెను." నిర్గమ 15:8. మరియు అతడు మందిరమునకును బలిపీఠమునకును చుట్టు ఆవరణమును ఏర్పరచి....... మోషే పని సంపూర్తి చేసెను. (నిర్గమ 40:33). అరణ్య యాత్రలో ప్రత్యక్ష గుడారమును గూర్చి ఇంతవరకు మనము చూచితిమి. దేవాల యమును గూర్చి 1 రాజులు 6:1, 2, రాజైన సొలొమోను యెహోవా మందిరము కట్టింప నారంభించెను. 1 రాజులు 6-7 అధ్యాయ ములందు మందిర నిర్మాణము ఎట్లు జరిగినదో పరిపూర్ణముగా వ్రాయ బడినది.

దేవుని నిత్య సంకల్పము ఇదే యని, దాని కార్య సిద్ధి కొరకు ఆయన పని చేయుచున్నాడని పౌలు భక్తుడు పలుకుచున్నాడు. "కాబట్టి మీరిక మీదట పరజనులును పరదేశులునై యుండక, పరిశుద్ధులతో ఏక పట్టణ స్థులును దేవుని యింటి వారునై యున్నారు". ఎఫెసీ 2:19. మనము అడుగువాటన్నిటి కంటెను ఊహించు వాటన్నిటి కంటెను అత్యధికముగా చేయు శక్తిగల దేవునికి, క్రీస్తు యేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగును గాక, ఆమెన్! (ఎఫెసీ 3:20-21). ఇదిగో దేవుని నివాసము మనుష్యులతో కూడి ఉన్నది. ప్రకటన 21:3. దేవుడైన ప్రభువే వారి మీద ప్రకాశించును వారు యుగ యుగములు రాజ్యము చేయుదురు. ప్రకటన 22:5. సర్వాధికారియైన ..... ప్రభువును గొఱ్ఱె పిల్లయు..... దేవాలయమై యున్నారు. ప్రకటన 21:22. దేవునితో ఆయన ప్రజలుందురు, దేవునికి మానవునికి గల సహవాసము సంఘము మాత్రమే. ఆయన కట్టి యున్న సంఘమునకు శిరస్సు క్రీస్తే;

ఆయన సంఘములో సంఘము ద్వారానే ఆరా ధింపబడుచున్నాడు. మహిమ పొందు చున్నాడు. ఆదాము హవ్వలు పాపములో పడిపోకముందు ఏదెను వనములో వారి సృష్టికర్తతో సహవాసము కలిగి యుండుటయే వారికి దీవెన, ఆశీర్వాదము అధిక్యతగా యుండెను. వారి సహవాస మునకు భంగము కలిగినప్పుడు విషాద కరమైన మాటలు వ్రాయబడెను. చల్లపూ టను ఆదామును అతని భార్యయు తోట లో సంచరించు చున్న దేవుడైన యెహోవా స్వరము విని, దేవుడైన యెహోవా ఎదుటికి రాకుండ తోట చెట్ల మధ్యను దాగుకొనిరి. (ఆది 3:8-9). యెహోవా ఆదామును పిలిచి- నీవు ఎక్కడ ఉన్నావు? అనెను. మనలో చాలా మంది నేడు సంఘ సహవాసము నుండి వేరుగా దూరపడి చెట్లు చాటున దాగిన ఆదాము హవ్వల వలె సిగ్గుతో తలదించుకుని ఆదామును పిలిచినట్లు పేరుపెట్టి పిలుస్తుంటే ఆయన ఎదుటికి రాలేని స్థితిని కలిగియుండుటకు గల కారణాలేమిటో ఊహించితిరా? పాపము. ఆజ్ఞాతిక్రమమే పాపము. దేవుని వాక్యమును ధిక్క రించుటే పాపము. పాపము ప్రవేశించి, దేవునితో వారికున్న సహవాసమును పాడుచేసెను. దేవుని స్వరము వినుట. ఆయనతో సహవాసము చేయుట ఆయన సన్నిధిలో సంతోషించుట ఇక ఏమాత్రమును వారికి సాధ్యము కాకపోయెను. పరదైసు (ఏదెను) పరిస్థితులు తిరిగి పొందుటకు సాధ్యము కాకపోయినను, తెగిపోయిన సంబం ధమును తిరిగి స్థాపించుటకును, మానవులతో నివసించవలెనను ఆయన ఉద్దేశమును కొనసాగించుటకును దేవుడు వారికి ఒక సదుపాయమును కల్పించెను. ఇది ఆశ్చర్యమును కృతజ్ఞ తాభావమును కలిగి యుండు టకు కారణమాయెను (ఆది 3:15).

ఆదాము అవిధేయత వలన కలిగిన ఫలితము ఏమనగా దేవుని సహవాసమును, ఆయన సన్నిధిని కోల్పోవుట, దేవునికి దూరముగా జీవించుట, అయితే క్రీస్తునందు నూతన జీవము యొక్క లక్షణము లేవనగా, విధేయత, దేవునితో సహవాసము. మీరు పాపమునకు దాసులై యుంటిరిగాని ఏ ఉపదేశక్రమమునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయ పూర్వకముగా లోబడిన వారై, పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి. ఇందుకు దేవునికి స్తోత్రము. అయినను ఇప్పుడు పాపమునుండి విమోచింపబడి దేవునికి దాసులైనందున పరిశుద్ధత కలుగుటయే మీకు ఫలము; దాని అంతము నిత్యజీవము (రోమా

6:17, 22). ఆత్మానుసారమైన మనస్సు జీవమును సమాధానమునై యున్నది (రోమా 8:5-6). "మన ప్రభువైన యేసు క్రీస్తు అను తన కమారుని సహవాసము (సంఘము)నకు మిమ్మును పిలిచిన దేవుడు నమ్మతగినవాడు. (1 కొరింధి 1:9). విధేయత, దేవుని స్వరమునకు లోబడుట నిత్యజీవము యొక్క లక్షణములు. విధేయత యొక్క ఫలితము ఆచరణలో నీతి కలిగి యుండుట. నీతి నిమిత్తముగా విధేయత. (రోమా 6:16). పరిశుద్ధత కలుగుటకై నీతికి దాసులగుట (రోమా 6:19). దేవుని ఆత్మచేత నడిపింపబడు నూతన జీవమును గూర్చి పౌలు చెప్పుచున్నాడు. ఆత్మ సంబంధమైన సంగతులతో మనస్సు నింపబడిన వ్యక్తి నూతన ఆశలు కలిగి యుండునని అపొస్తలుని ఉద్దేశము (రోమా 8:5).

మోషే కాలమునందు ఏర్పాటు చేయబడిన ప్రత్యక్ష గుడారము. రాజైన సొలొమోను నిర్మించిన మందిరము. మనకు నేర్పించు విధానము ఒక్కటే! అదేమంటే దేవుని క్రమమును మాదిరిని మనము కలిగియుండడము. హెబ్రీ 8:5, 9:11. ఈ మందిరము యొక్క విశిష్టత ఏమంటే, క్రీస్తు యేసు రక్తము వలన విమోచింపబడిన వారు క్రీస్తులో పాలిన వారుగా ఉండుట. "నాయందు మీరును మీ యందు నా మాట లును నిలిచి యుం డాలని ఆయన కోరుచున్నాడు (యోహాను 15:7). యేసు క్రీస్తు హస్తకృతము కాని, ఘనమైన పరిపూర్ణమైన ఆలయమునకు ప్రభువు గా ఉన్నాడు. హెబ్రీ 9:11 ప్రకటన 21:22. ఆయన యందుండి నడుచు కొనువారు ఏమై యున్నారు? మనుష్యు లచేత విసర్జింప బడినను, దేవుని దృష్టికి ఏర్పరచబడి నదియు అమూల్యమునుసజీవమునైన రాయియగు ప్రభువు నొద్దకు వచ్చిన వారై, యేసు క్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలుల నర్పించుటకు పరిశుద్ధ యాజ కులుగా ఉండునట్లు మీరును సజీవమైన రాళ్లవలె నుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడు చున్నారు. (1 పేతురు 2:4-5). ఎక్కడ హృదయ శుద్ధి గల వారుందురో అక్కడ వారు దేవుని చూచెదరు. ఎక్కడ నమ్మి బాప్తిస్మము పొందిన వారుందురో వారిలో ప్రభువు ఉండును. ఎవరు దేవుని ప్రజలుగా గుర్తింపబడు చున్నారో వారు దేవునికి ఆలయముగా ఉంటున్నారు. ఆత్మయైన దేవుడు వారిలో వారితో ఉంటున్నాడు. దేవుని ఆలయ మును పాడుచేయకూడదు. (1 కొరింధి 3:16-17).

ఏ మనుష్యుడు దేవుడు లేని వాడుగా ఉండకూడదు. దేవునికి ఈ లోకమునందున్న ప్రతి యొక్కరు కావాలని, "లోకమును ఎంతో ప్రేమించెను" (యోహాను 3:16). మను ష్యులతో ఆయన నివాస ముండాలని తన కుమారుని పంపిం చెను. ఆ కుమారుడే యేసు! యేసు అనగా తన ప్రజలను వారి పాపముల నుండి విడిపించువాడు (మత్తయి 1:21). రక్షించువాడు ఇమ్మానుయేలు, యేసు క్రీస్తు, నిజమైన దేవుడు (1 యోహాను 5:20). నీతో నీలో ఉండుటకు వచ్చియుండగా ఆయనను చూచి, లేక ఆయన స్వరం విని దాగుకొన ప్రయత్నించకుము. ఆదాము నందు అందరు ఏలాగు మృతులగుచున్నారో ఆలాగుననే క్రీస్తునందు అందరు జీవించుదురు. (1కొరింది 15:22). ఈ జీవమైన క్రీస్తులో ఆలయముగా కట్టబడు టకు యిష్టపడుమని ప్రాధేయపడి నిన్ను కోరుచున్నాను.

✍ - సామ్యేలు జాన్ మేడిద

# క్రైస్తవులు క్రైస్తవులుగా యుంటే
## (If Christians were Christians)

బైబిలు బోధించు రీతిగా క్రైస్తవులందరు క్రైస్తవులుగానే యుంటే పరిస్థితులు ఎట్లుంటాయోయనేది మన ఆలోచన:

1. *జాతి విక్షత యుండదు:* యేసు, ఆయన అపొస్తలులందరు యూదులు. రక్షణ యూదులలో నుండియే కలు గును అని ఆయన చెప్పారు (యోహాను 4:22). యూదా జనాంగము ద్వారానే దేవుని రక్షణ సంకల్పము బయలు పర్చబడవలసి యున్నదని, వాగ్దానము చేయబడిన క్రీస్తు యూదులలో నుండి యేవచ్చునని యేసు యొక్క భావము.

యూదులకు సమరయులకును మధ్యనున్న ద్వేషభావములను యేసు ఎరుగును. ఏలయనగా సమరయులు ఒక మిశ్రమజాతి వారు. యేసు దానిని ప్రక్కన బెట్టి సుఖారులో ఒక సమరయ స్త్రీ నుండి నీళ్లు అడిగెను, యేసు ఆమెను మార్చి, సమరయుల గ్రామములో యుండుటకు ఆ ప్రజల ఆహ్వానము నంగీకరించెను. యూదులకు సమరయులకు మధ్య నున్న పురాతన ద్వేషభావాలను, అడ్డును తొల గించుటకు యేసు ప్రభువు చేసిన పని గొప్పది.

క్రీస్తు మరణానంతరం జాతి విక్షత అంటూ దేవుని సన్నిధానంలో యేమిలేదు (గలతీ 3:26-29).

**2. క్రైస్తవుల మధ్య యుద్ధం వుండదు:** క్రైస్తవుల మధ్యనున్న విభేదాలను వారు యుద్ధం చేసి పరిష్క రించుకోరు. మన సైన్యాధిపతియైన యేసు క్రీస్తు ఈలోక సంబంధమైన పోరాటములో ఎన్నడు ఒక సైన్యానికి నాయకత్వం వహించలేదు. క్రైస్తవుల మను కొను వారందరు క్రీస్తును రాజుగా తమ జీవితాల్లో ప్రతిష్టించితే, వారి మధ్య యుద్ధములుండవు.

***3. ఆత్మీయంగా నైతికంగా ఈలోకము తలక్రిందులు చేయబడును:*** ఆదిమ క్రైస్తవులు తమ బోధ ద్వారా, జీవితం ద్వారా చేసింది అదే (అపొ.కా. 17:6). వారి వలె క్రీస్తును గూర్చి, ఆయన సువార్తను గూర్చి రవులు కొనుచున్న ఆసక్తి మనకవసరం. అయితే విచారం యేమంటే క్రైస్తవుల మని చెప్పుకొనే వారి ఆసక్తి చల్లబడి పోయింది.

ఆత్మీయంగా క్రైస్తవులుగా యుంటే, అందరు మొదటి శతాబ్దపు క్రైస్తవ్యము దగ్గరకు వెళ్ళుదురు. బైబిలు ను మాత్రమే వారు తమ మార్గదర్శిగా ఎంచు కొందురు, క్రొత్త నిబంధన సంఘ ము నొక్కదానినే ఎంచుకొందురు. క్రీస్తు యొక్క నిజ ఆత్మను కలిగి నశించువారి ఆత్మలను రక్షించుటకు పూనుకొందురు. క్రైస్తవుల కొక ప్రయోజనం వుండును.

- డగ్లస్ హేరిస్

※ ※ ※

---

సత్యవాణి రేడియో కార్యక్రమాలను ఆది, సోమ, బుధ, గురువారల్లో మధ్యాహ్నం 2:00 గంటలకు రేడియో శ్రీలంక ద్వారా వినండి. మీ బంధుమిత్రులకు విన్పించండి !!

---

గమనిక : సత్యవాక్కు కావలసినవారు సంవత్సరమునకు 30/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.
SATYA VANI, P.O. BOX - 80, KAKINADA - 533 001.

## *HEAR THE VOICE OF TRUTH ON RADIO SRILANKA*

| | | |
|---|---|---|
| TELUGU | : | Sunday, Monday, Wednesday & Thursday, 2:00 P.M.-2:15 P.M. |
| T.V. | : | Every Saturday 6:30 A.M. on Teja Channel. *Speaker : Joshua Gootam,* P.O.Box-80, Kakinada - 533 001. |
| HINDI | : | Sunday 6:45 p.m. 7:00 p.m. and Thursday, 6:45 p.m. 7:00 p.m. Speaker, *Sunny David*, P.O.Box 3815, New Delhi - 110 049. |
| TAMIL | : | Monday, Tuesday, Wednesday, Thursday, Friday 5:30 p.m. to 5:45 p.m. Speaker : *P.R.Swamy,* P.O. Box-8405, Bangalore-560084. |
| MALAYALAM | : | Friday, 3:45 p.m. 4:00 p.m. Speaker : *P.K.Varghese*, P.O. Box 5540 Trivendrum-695043 (Kerala). |
| PAITE | : | Sunday 8:00 p.m. Speaker, *Kamlianpao,* P.O.Box-56, Churachandpur, Manipur-795128. |

Please write to these addresses for Bible correspondence courses, magazines, and other Christian literature in your language.

ALL OF THESE PROGRAMMES ARE SPONSORED BY CHURCHES OF CHRIST.

21వ తేదీ వరకు సోదరులు డగ్ హేమిల్టన్ గారు జాషువా గూటం గారితో కలిసి నాయకంపల్లి, తోత్తరమూడి, పెద్దాపురం, ముక్కొల్లు, అమలాపురం, యెంట్రుకోన, తదితర స్థలాల్లో యున్న సంఘములను దర్శించి వాక్యపరిచర్యచేసిరి. 22వ తేదీ ఉదయం డగ్‌హేమిల్టన్ గారు అమెరికాకు తిరిగి వెళ్లిరి.

సెప్టెంబరు 20వ తేదీ సాయంత్రం అమెరికాలో కెమికల్ ఇంజనీరింగ్ చేయుచున్న జాషువాగారి 2వ కుమారుడు సామ్యూల్ రోనీ సెలవుల నిమిత్తం కాకినాడ చేరుకొనిరి. మరియు 24వ తేదీ ఉదయం అమెరికాలో *MBA* ముగించిన వారి జ్యేష్ట కుమారుడు జాన్ రిక్కీ గారు కూడ సెలవుల నిమిత్తం కాకినాడకు క్షేమముగా చేరుకొనిరి. ఈ యువకులిద్దరు దేవుని వాక్యపరిచర్యలో గొప్ప ఆసక్తి గలవారు. జాషువాగారి కనిష్ట కుమారుడు రాబిన్ గూటంగారు తేజ ఛానల్ ద్వారా పాఠకులకు సుపరిచితులే. ఆయన మద్రాసులో B.Tech Final Year చదువుచున్నారు.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:

**SATYA VAKKU**
**P.O. Box 80,**
**Kakinada - 533 001**

To

**Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.**